# ఇండియన్ పాలిటీ

## భారత రాజ్యాంగ అభివృద్ధి (1858–1947)

### భారత ప్రభుత్వ చట్టం 1935

ఈ చట్టం భారత రాజ్యాంగానికి ప్రధాన ప్రాతిపదిక, ఆధారం. భారత రాజ్యాంగంలోని 70 శాతానికిపైగా అంశాలు ఈ చట్టం నుంచి గ్రహించినవే. బ్రిటిష్ పార్లమెంట్ అప్పటివరకు ఆమోదించిన చట్టాల్లో అతిపెద్దది. భారతదేశ పాలన కోసం బ్రిటిష్ ప్రభుత్వం చేసిన చట్టాల్లోనూ అతిపెద్దది. ఇందులో 321 ప్రకరణలు, 10 షెడ్యూల్స్, 14 భాగాలు ఉన్నాయి.

*ముఖ్యాంశాలు:*

★ భారత రాజ్య కార్యదర్శి అధికారాలను మరింతగా తగ్గించారు.

★ 1858 లో ఏర్పాటు చేసిన ఇండియా కౌన్సిల్‌ను రద్దు చేశారు. దీని స్థానంలో ముగ్గురికి తగ్గకుండా, ఆరుగురికి మించకుండా ఉండే సలహా మండలిని ఏర్పాటు చేశారు.

★ బర్మాను భారతదేశం నుంచి వేరు చేశారు.

★ అఖిల భారత సమాఖ్య వ్యవస్థను ప్రతిపాదించారు. ఇందులో బ్రిటిష్ ఇండియా పాలిత రాష్ట్రాలు (11 రాష్ట్రాలు, 6 చీఫ్ కమిషనర్ల ప్రాంతాలు), స్వదేశీ సంస్థానాలు ఉంటాయి. అయితే, స్వదేశీ సంస్థానాలకు సమాఖ్యలో చేరడానికి, చేరకపోవడానికి అవకాశం ఇచ్చారు. దీంతో ఇది ఆచరణలో కార్యరూపం దాల్చలేదు.

★ కేంద్రం, రాష్ట్రాల మధ్య శాసనాంశాల విభజన జరిగింది. మొత్తం శాసనాంశాలను 3 జాబితాలుగా విభజించారు.

i) ఫెడరల్ జాబితా - 59 అంశాలు - శాసనాధికారం కేంద్రానికి ఉంటుంది.

ii) రాష్ట్ర జాబితా - 54 అంశాలు - శాసనాధికారం రాష్ట్రాలకు ఉంటుంది.

iii) ఉమ్మడి జాబితా - 36 అంశాలు - శాసనాధికారం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుంది. కానీ కేంద్ర ప్రభుత్వ శాసనానికే ఆధిక్యం ఉంటుంది.

పై మూడు జాబితాల్లో లేని అవశిష్ట అంశాలపై శాసనాధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.

★ ఎగువ సభ అయిన 'కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్' సభ్యుల సంఖ్యను 260 కి, దిగువ సభ అయిన 'సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ' సభ్యుల సంఖ్యను 375 కు పెంచారు. ఎగువ సభ శాశ్వత సభ. ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి 1/3 వ వంతు సభ్యులు పదవీ విరమణ చేస్తారు, తిరిగి అంతేమంది ఎన్నిక అవుతారు. దిగువ సభ కాలపరిమితి 5 సంవత్సరాలు. కాలపరిమితి పూర్తి కాకుండానే దీన్ని రద్దు చేసే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంది. ఆర్థిక బిల్లులను మొదట దిగువ సభలోనే ప్రవేశపెట్టాలి.

★ కేంద్రంలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టారు. కేంద్ర మంత్రిత్వ శాఖలను రిజర్వ్‌డ్ శాఖలు, ట్రాన్స్‌ఫర్డ్ శాఖలుగా విభజించారు. రిజర్వ్‌డ్ శాఖలను గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలిలోని ముగ్గురు సభ్యులు నిర్వహిస్తారు. ట్రాన్స్‌ఫర్డ్ శాఖలను 10 మంది భారతీయ మంత్రులు నిర్వహిస్తారు. మంత్రులను నియమించే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంటుంది.

★ ఫెడరల్ కోర్టును ఏర్పాటు చేశారు. ఇందులో ఒక ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు సాధారణ న్యాయమూర్తులు ఉంటారు. ఇది రాష్ట్రాల మధ్య వివాదాలను, కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదాలను పరిష్కరిస్తుంది. దీని తీర్పులపై ప్రివి కౌన్సిల్ (బ్రిటిష్ రాణి లేదా చక్రవర్తికి సలహాలిచ్చే మండలి మొత్తం సభ్యులను ప్రివి కౌన్సిల్ అంటారు) సమీక్ష జరుపుతుంది.

★ కేంద్రంలో ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను, రాష్ట్రాల్లో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటు చేశారు.

★ 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'ను ఏర్పాటు చేశారు.

★ ప్రత్యేక నియోజక వర్గాలను కొనసాగించడంతోపాటు, అణగారిన వర్గాలకు కూడా నియోజక వర్గాలను కేటాయించారు.

★ కొత్తగా ఒరిస్సా, సింధ్ ప్రావిన్సులను లేదా రాష్ట్రాలను ఏర్పాటు చేశారు.

★ రాష్ట్రాల్లో స్వయం ప్రతిపత్తితో కూడిన స్వపరిపాలనను ఏర్పాటు చేశారు. ద్వంద్వ పాలనను రద్దు చేశారు.

★ రాష్ట్రాల్లో ద్విసభా విధానాన్ని (11 రాష్ట్రాలకు, 6 రాష్ట్రాల్లో మాత్రమే ఏర్పాటు) ప్రవేశపెట్టారు. దిగువ సభ కాలపరిమితి 5 సంవత్సరాలు, ఎగువ సభ కాలపరిమితి 3 సంవత్సరాలు.

★ చార్టర్ చట్టం 1813 ప్రకారం భారతదేశంలో విజ్ఞానశాస్త్ర అభివృద్ధిని ప్రోత్సహించడానికి కేటాయించిన మొత్తం రూ. 1,00,000.

★ రెగ్యులేటింగ్ చట్టం 1773 ప్రకారం..
★ కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ పదవీకాలాన్ని ఏడాది నుంచి 4 సంవత్సరాలకు పెంచారు.
★ గవర్నర్ జనరల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు.
★ సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు.
★ పిట్ ఇండియా చట్టం 1784 ప్రకారం బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఏర్పడింది.

## భారత స్వాతంత్ర్య చట్టం 1947

భారతదేశం కోసం బ్రిటిష్ ప్రభుత్వం చేసిన చివరి చట్టమిది. చారిత్రాత్మకమైన ఈ చట్టంపై 1947 జులై 18న బ్రిటిష్ రాణి సంతకం చేసింది. ఇది 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చింది.

*ముఖ్యాంశాలు:*

★ ఇండియా, పాకిస్థాన్ అనే రెండు స్వతంత్ర రాజ్యాలు ఏర్పడ్డాయి.
★ ఇండియా, పాకిస్థాన్‌లకు వేర్వేరు రాజ్యాంగ పరిషత్‌లను ఏర్పాటు చేస్తారు.
★ స్వదేశీ సంస్థానాలపై బ్రిటిష్ సార్వభౌమాధికారం రద్దు అవుతుంది.
★ భారత రాజ్య కార్యదర్శి, వైస్రాయ్ పదవులు రద్దవుతాయి.
★ బ్రిటిష్ రాణికి 'భారత చక్రవర్తి' అనే బిరుదు రద్దు అవుతుంది.
★ భారత గవర్నర్ జనరల్, రాష్ట్రాల గవర్నర్లు రాజ్యాంగ అధిపతులుగా వ్యవహరిస్తారు. వారికి ఉన్న 'వీటో' అధికారాలు రద్దవుతాయి.
★ భారత్, పాకిస్థాన్‌లకు విడిగా గవర్నర్ జనరల్స్‌ను నియమిస్తారు (స్వతంత్ర భారతదేశానికి మొదటి గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్ బాటెన్, పాకిస్థాన్ మొదటి గవర్నర్ జనరల్ మహ్మద్ అలీ జిన్నా).
★ భారత రాజ్యాంగ పరిషత్ తాత్కాలిక పార్లమెంటుగా పనిచేసి, చట్టాలను రూపొందిస్తుంది.

## మాదిరి ప్రశ్నలు

**1.** ఇండియా కౌన్సిల్ 1858లో ఏర్పాటైంది. అయితే, ఇందులోని సభ్యుల సంఖ్య ఎంత?
ఎ) 12 బి) 13 సి) 15 డి) 16

**2.** కింది వాటిలో సరికానిది ఏది?
ఎ) మొదటి వైస్రాయ్ చార్లెస్ కానింగ్
బి) మొదటి భారత రాజ్య కార్యదర్శి చార్లెస్ ఉడ్
సి) విక్టోరియా మహారాణి ప్రకటన 1858 నవంబరు 1
డి) ఇండియా కౌన్సిల్ సమావేశాలకు గవర్నర్ జనరల్ అధ్యక్షత వహిస్తారు.

**3.** భారత ప్రభుత్వంలో పోర్ట్‌ఫోలియో విధానాన్ని ప్రవేశపెట్టిన చట్టం ఏది?
ఎ) భారత కౌన్సిళ్ల చట్టం 1861 బి) భారత కౌన్సిళ్ల చట్టం 1892
సి) భారత కౌన్సిళ్ల చట్టం 1909 డి) భారత ప్రభుత్వ చట్టం 1919

**4.** గవర్నర్ జనరల్‌కు ఆబ్సల్యూట్ వీటో అధికారాన్ని కల్పించిన (మొదటిసారిగా) చట్టం ఏది?
ఎ) భారత ప్రభుత్వ చట్టం 1858 బి) భారత కౌన్సిళ్ల చట్టం 1861
సి) భారత కౌన్సిళ్ల చట్టం 1892 డి) భారత ప్రభుత్వ చట్టం 1919

**5.** భారత జాతీయ కాంగ్రెస్‌కు సంబంధించి సరైంది ఏది?
ఎ) 1885లో స్థాపితమైంది బి) స్థాపనకు కారకుడు ఎ.ఒ. హ్యూమ్
సి) మొదటి అధ్యక్షుడు డబ్ల్యూ.సి. బెనర్జీ డి) అన్నీ సరైనవే

**6.** మార్లే - మింటో సంస్కరణలను ప్రవేశపెట్టిన సంవత్సరం ఏది?

ఎ) 1861 బి) 1892 సి) 1909 డి) 1919

**7.** 'ది ఇండియన్ ముస్లిమ్స్' అనే గ్రంథాన్ని రచించింది ఎవరు?

ఎ) చార్లెస్ ఉడ్ బి) విలియం హంటర్ సి) లార్డ్ మెకాలే డి) లార్డ్ కర్జన్

**8.** కింది వాటిని జతపరచండి.

I) భారతీయ యూనివర్సిటీల చట్టం A) 1904

II) అధికార రహస్యాల చట్టం B) 1927

III) అరండేల్ కమిటీ C) 1904

IV) సైమన్ కమిషన్ D) 1906

ఎ) I–A II–D III–C IV–B బి) I–C II–D III–A IV–B

సి) I–D II–A III–C IV–B డి) I–A II–C III–D IV–B

**9.** భారత ప్రభుత్వ చట్టం 1919 కి సంబంధించి సరికానిది ఏది?

ఎ) కేంద్రంలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టారు.

బి) భారత హై కమిషనర్ పదవిని సృష్టించారు.

సి) ట్రాన్స్‌ఫర్డ్ శాఖలు 22.

డి) ఇండియా కౌన్సిల్ సభ్యుల సంఖ్యను 12 కు తగ్గించారు.

**10.** భారత రాజ్యాంగ నిర్మాణంలో భారత రాజ్యాంగ పరిషత్ నిర్మాణానికి ప్రధాన ఆధారంగా స్వీకరించిన అంశమేది?

ఎ) భారత ప్రభుత్వ చట్టం 1919 బి) భారత ప్రభుత్వ చట్టం 1935

సి) భారత కౌన్సిళ్ల చట్టం 1909 డి) భారత స్వాతంత్ర్య చట్టం 1947

**11.** ఈస్టిండియా కంపెనీకి 1600 లో అప్పటి బ్రిటిష్ రాణి ఎలిజబెత్ - I భారతదేశంలో ఎంత కాలం వర్తకం చేసుకోవడానికి చార్టర్‌ను జారీ చేసింది?

ఎ) 20 సంవత్సరాలు బి) 15 సంవత్సరాలు సి) 10 సంవత్సరాలు డి) 5 సంవత్సరాలు

**12.** 1773 రెగ్యులేటింగ్ చట్టం ద్వారా కలకత్తాలోని 'ఫోర్టు విలియం'లో ఏర్పాటు చేసిన సుప్రీంకోర్టుకు మొదటి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?

ఎ) ఎలిజా ఇంఫే బి) లార్డ్ మెకాలే సి) చార్లెస్ ఉడ్ డి) విలియం

**13.** 'బోర్డ్ ఆఫ్ కంట్రోల్'ను ఏర్పాటు చేసిన చట్టం ఏది?

ఎ) 1853 చార్టర్ చట్టం బి) 1793 చార్టర్ చట్టం

సి) 1773 రెగ్యులేటింగ్ చట్టం డి) 1784 పిట్ ఇండియా చట్టం

**14.** 'గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్'ను నియమించే అధికారం ఎవరికి ఉంది?

ఎ) బోర్డ్ ఆఫ్ కంట్రోల్ బి) బ్రిటిష్ రాణి లేదా చక్రవర్తి

సి) కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ డి) గవర్నర్ జనరల్ కౌన్సిల్

**15.** హోం ఛార్జెస్ (స్వదేశీ ఖర్చులు)ను విధించిన చార్టర్ చట్టం ఏది?

ఎ) 1773 రెగ్యులేటింగ్ చట్టం బి) పిట్ ఇండియా చట్టం 1784

సి) 1793 చార్టర్ చట్టం డి) 1786 సవరణ చట్టం

**16.** 'కారన్ వాలీస్ కోడ్'ను ఏ సంవత్సరంలో రూపొందించారు?

ఎ) 1833 బి) 1813 సి) 1773 డి) 1793

17. మొదటిసారిగా గవర్నర్ జనరల్ కౌన్సిల్ నిర్ణయాలను వీటో చేసే అధికారాన్ని పొందిన కంపెనీ గవర్నర్ జనరల్ ఎవరు?
ఎ) కారన్ వాలీస్ బి) వారన్ హేస్టింగ్స్ సి) విలియం బెంటింక్ డి) వెల్లస్లీ

18. మొట్టమొదటి లిఖిత రాజ్యాంగంగా వర్ణించే చట్టం ఏది?
ఎ) రెగ్యులేటింగ్ చట్టం 1773 బి) 1784 పిట్ ఇండియా చట్టం
సి) చార్టర్ చట్టం 1793 డి) చార్టర్ చట్టం 1833

19. ఈస్టిండియా కంపెనీకి చైనాతో ఉన్న వ్యాపార గుత్తాధిపత్యాన్ని రద్దు చేసిన చార్టర్ చట్టం ఏది?
ఎ) చార్టర్ చట్టం 1793 బి) చార్టర్ చట్టం 1813
సి) చార్టర్ చట్టం 1833 డి) చార్టర్ చట్టం 1853

20. చార్టర్ చట్టం 1833 ప్రకారం కిందివాటిలో సరైంది ఏది?
ఎ) గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లో 'లా మెంబరు'ను నియమించారు.
బి) గవర్నర్ జనరల్ కౌన్సిలో 'లా మెంబరు'కు ఓటు వేసే అర్హత లేదు.
సి) మొదటి లా మెంబరు లార్డ్ మెకాలే.
డి) ఎ, బి, సి సరైనవి

21. ఈస్టిండియా కంపెనీ పౌర, సైనిక ఉద్యోగులకు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసిన చట్టం ఏది?
ఎ) చార్టర్ చట్టం 1813 బి) చార్టర్ చట్టం 1833
సి) చార్టర్ చట్టం 1853 డి) పిట్ ఇండియా చట్టం 1784

22. బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలకు శాసనాధికారాలను రద్దు చేసిన చట్టం ఏది?
ఎ) చార్టర్ చట్టం 1793 బి) చార్టర్ చట్టం 1813
సి) చార్టర్ చట్టం 1833 డి) చార్టర్ చట్టం 1853

23. కిందివాటిలో చార్టర్ చట్టం 1853 ప్రకారం సరికానిది ఏది?
ఎ) కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ సంఖ్యను 24 నుంచి 18 కి తగ్గించారు.
బి) చివరి చార్టర్ చట్టం.
సి) సివిల్ సర్వీస్ నియామకాల్లో బహిరంగ పోటీని అనుమతించిన చట్టం.
డి) కంపెనీ పాలనాధికారాన్ని 20 సంవత్సరాలు పొడిగించిన చట్టం.

24. చార్టర్ చట్టం 1853 ప్రకారం ఏర్పాటు చేసిన కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుల సంఖ్య?
ఎ) 4 బి) 12 సి) 6 డి) 3

25. భారత వ్యవహారాల మంత్రిని 'బోర్డ్ ఆఫ్ కంట్రోల్' అధ్యక్షుడిగా చేసిన చట్టం ఏది?
ఎ) చార్టర్ చట్టం 1833 బి) చార్టర్ చట్టం 1813
సి) చార్టర్ చట్టం 1853 డి) చార్టర్ చట్టం 1793

**జవాబులు**

1–సి; 2–డి; 3–ఎ; 4–బి; 5–డి; 6–సి; 7–బి; 8–డి; 9–ఎ; 10–బి; 11–బి; 12–ఎ; 13–డి; 14–సి; 15–సి; 16–డి; 17–ఎ; 18–ఎ; 19–సి; 20–డి; 21–ఎ; 22–సి; 23–డి; 24–బి; 25–ఎ.

రచయిత: డాక్టర్ ఎం. భాస్కర రాజు